సాక్షి కర్నూలు

శనివారం ; 9 ; ఆగస్టు ; 2025



పంటల భవితవ్యం తెలిపే దండలు

నల్లచెలిమల వద్ద ఉన్న కొండ మీద పెద్ద రాళ్ల మధ్య నుంచి శనివారం పూల దండలను కింద కు వదులుతారు. దండలు నలిగిన శాతాన్ని బట్టి పంటల పండే వివరాలు చెబుతారు. 8లో▸



విజ్ఞాన దర్శిని.. పుస్తకం

పుస్తక పఠనంతో సంపూర్ణ పరిజ్ఞానం వస్తుంది. పుస్తక ప్రియుల కోసం ప్రత్యేకంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 9న 'పుస్తక ప్రేమికుల దినోత్సవం' నిర్వహిస్తున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 33,000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 32,488

పేకాట 'మత్తు'!

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఇలాఖాలో విచ్చలవిడి పేకాట

- కోవెలకుంట్లలోని ఆరు ప్రాంతాల్లో శిబిరాలు
- బనగానపల్లిలో మంత్రి పీఏ సమీప బంధువు ఆధ్వర్యంలో నిర్వహణ
- సంజామల మండలం మెట్ల కొత్తూరులో రూ.4–5లక్షలతో పేకాట శిబిరం
- కడప, అనంతపురం, నంద్యాల, కర్నూలు జిల్లాల నుంచి పేకాటరాయుళ్లు
- ఇప్పటివరకు పేకాటకు పెట్టింది పేరు రాయచూరు
- ఇప్పుడు బనగానపల్లి వైపునకు అధిక శాతం ఆటగాళ్లు
- రూ.లక్ష నుంచి రూ.2లక్షల బ్యాంక్ ఆటలు

పేకాట ఆడాలంటే అనంతపురం, కడప, కర్నూలు పేకాట రాయుళ్లు ఏడాది కిందటి వరకూ వెళ్లే ప్రాంతం రాయచూరు. ఇప్పుడు నంద్యాల జిల్లాలోని బనగానపల్లి ప్రాంతం. 'మా ప్రభుత్వం అధికారంలో ఉంది. అన్న మంత్రి అయ్యాడు. మీకు ఏ ఇబ్బందీ ఉండదు. రండి' అని ఆహ్వానిస్తున్నారు. గూగుల్ లొకేషన్లు షేర్ చేసి వచ్చిన వారిని కొత్త పెళ్లికొడుకుల్లా చూస్తూ సకల మర్యాదలు చేసి ఆటాడించి పంపిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో టీడీపీ నేతలకు ఇదే అతిపెద్ద ఆదాయ వనరు. అరికట్టాల్సిన పోలీసులు కూడా మామూళ్ల మత్తులో జోగుతున్నట్లు చర్చ జరుగుతోంది.



సాక్షి ప్రతినిధి కర్నూలు: తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చాక ఇసుక, గ్రావెల్, మట్టి తదితర సహజ వనరులతో పాటు ఆదాయం ఉన్న ఏ మార్గాన్నీ ఆ పార్టీ నేతలు వదలని పరిస్థితి. వీటి ద్వారా ఇప్పటికే వీరు భారీగా ఆర్జిస్తున్నారు. ఇప్పుడు అత్యంత సులువుగా, భారీగా ఆదాయం వచ్చే 'పేకాట'ను ఎంచుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పుడు పేకాటరాయుళ్ల నోళ్లలో నానుతున్న పేర్లు బనగానపల్లె, కోవెలకుంట్ల. ఈ రెండు ప్రాంతాల్లో కలిపి 10 శిబిరాల్లో పేకాట సాగుతోంది. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అనుచరుల కనుసన్నల్లోనే ఈ శిబిరాలు కొనసాగుతున్నట్లు అక్కడి రాజకీయనేతలతో పాటు అధికారులకు తెలియంది కాదు. అయినా ఏ ఒక్క అధికారి, పోలీసులు అరికట్టే సాహసం చేయడం లేదంటే నిర్వాహకులకు మంత్రి బీసీ ఆశీస్సులు ఉండటమేనని తెలుస్తోంది.

గ్రామస్తుల తిరుగుబాటుతో మకాం మార్పు

మాజీమంత్రి గుమ్మనూరు జయరాం సొంత గ్రామం గుమ్మనూరులో గతంలో నిర్వహించిన పేకాట శిబిరాలను ఆదర్శంగా తీసుకుని సంజామల మండలం మెట్లకొత్తూరులో ఓ టీడీపీ నేత రూ.4–5లక్షలతో షెడ్డు నిర్మించాడు. ఇందులో పేకాట ఆడించారు. అయితే గ్రామస్తుల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. 'మహిళలు ఈ రోడ్డుపై తిరుగుతుంటారు. వేరే ఊర్ల నుంచి భారీగా కార్లు వస్తున్నాయి. ఇది పద్ధతి కాదు. మరొకచోట ఆడుకోండి..' అని గ్రామస్తులు వ్యతిరేకించడంతో ఆ శిబిరాన్ని తాత్కాలికంగా మూసేశారు. రోజూ ఒకచోట పేకాట ఆడిస్తూ, అడ్రస్ గూగుల్ మ్యాప్‌లో షేర్ చేస్తున్నారు.

రాయచూరు నుంచి బనగానపల్లి వైపు..

2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో రిక్రియేషన్ క్లబ్‌లలో పేకాట కొనసాగింది. గత ప్రభుత్వంలో క్లబ్‌లు పూర్తిగా నిషేధించారు. దీంతో చిత్తూరు మినహా రాయలసీమ జిల్లాల పేకాటరాయుళ్లు రాయచూరు క్లబ్‌కు వెళ్లేవాళ్లు. రాయచూర్‌లో ఇప్పటికీ పేకాట నడుస్తోంది. తెల్లవార్లూ గ్యాంబ్లింగ్ ఆడుతారు. అయితే బనగానపల్లిలో టీడీపీ నేతలు పేకాట నడపడం మొదలయ్యాక ప్రొద్దుటూరు, కడప, తాడిపత్రి, అనంతపురం, కర్నూలు, నంద్యాల, మహబూబ్‌నగర్, గద్వాల నుంచి కూడా ఇక్కడికే వస్తున్నారు. తెలంగాణ వాసులు కొద్దిరోజులు రాయచూర్, కొన్ని రోజులు బనగానపల్లికి వస్తున్నారు. తక్కిన 'సీమ' ప్రాంతాల నుంచి బనగానపల్లికి రోజూ ఒక్కో శిబిరానికి 15–20కి పైగా కార్లలో వస్తుండటం గమనార్హం.

కోవెలకుంట్లలో పేకాట శిబిరాలు ఎక్కడెక్కడంటే..

- జమ్మలమడుగు రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాలు పక్కన వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలోని ఓ ఇండిపెండెంట్ ఇల్లు.
- సంతపేటలోని ఓ ఇల్లు.
- ఓ టీడీపీ నేత ఆధ్వర్యంలో ఎస్టీకాలనీలో.
- చాకలి తిమ్మయ్య ఇంటి సమీపంలోని ఇల్లు.
- బస్టాండ్ రోడ్డులో ఓ స్కూలు ఎదురుగా ఉన్న ఇల్లు.
- మార్కెట్‌యార్డులోని ప్రభుత్వ అతిథి గృహం.



కోవెలకుంట్లలో పేకాట ఆడిస్తున్న ఓ నివాసం

బనగానపల్లెలో ఇలా..

- కరెంట్ ఆఫీసు సమీపంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పీఏ సమీప బంధువులు పేకాట ఆడిస్తున్నట్లు తెలుస్తోంది.
- బత్తలూరుపాడుకు చెందిన ఓ టీడీపీ నేత బనగానపల్లెలో ఉంటూ పేకాట శిబిరం నిర్వహిస్తున్నాడు.
- అవుకు మండలం రామాపురంలో ఓ టీడీపీ నేత ఆధ్వర్యంలో పేకాట సాగుతోంది.



పేకాటరాయుళ్లకు పంపిన గూగుల్ మ్యాప్ అడ్రస్

పేకాట రాయుళ్లకు కల్పించే సదుపాయాలు ఇవీ..

శిబిరం నిర్వాహకుడికి పాయింట్లు ఇచ్చినందుకు పేకాట ఆడేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి గదులు, రవాణా, కోరిన ఆహారం ఏర్పాటు చేస్తారు. రూ.2లక్షల బ్యాంకు ఆడే వారికి డబుల్‌బ్లాక్, గ్లెన్‌లివెట్ లాంటి విదేశీమందు ఇస్తారు. సుదూరప్రాంతాల నుంచి వచ్చే వారికి విమాన టిక్కెట్‌లు బుక్ చేస్తారు. ఇతర ప్రాంతాల నుంచి ఎక్కువమందిని పేకాటకు తీసుకొచ్చే వారికి నెలకు రూ.లక్ష–2లక్షలు గిఫ్ట్‌గా ఇస్తారు. ఈ స్థాయిలో బయటి వ్యక్తులు రోజూ వచ్చిపోతూ మద్యం సేవిస్తూ ఉంటే ఆయా ప్రాంతాల్లో స్థానికుల గౌరవం, రోజు వారీ జీవనం ఎలా ప్రభావితం అవుతుందో ఇట్టే తెలుస్తోంది.

అన్ని చోట్లా హైస్టేక్స్ శిబిరాలే..

పేకాట స్మాల్ స్టేక్(చిన్న బ్యాంకులు), హైస్టేక్(పెద్ద బ్యాంకులు) రెండు రకాలుగా జరుగుతుంది. స్మాల్‌స్టేక్‌లో రూ.10వేల నుంచి రూ.30వేల వరకూ ఆడతారు. హైస్టేక్‌లో రూ.50వేలు, రూ.లక్ష, రూ.2లక్షలు చొప్పున మూడు రకాల బ్యాంకులు ఆడతారు. కోవెలకుంట్ల, బనగానపల్లిలో జరిగే పేకాట మొత్తం హైస్టేక్స్ ఆడుతున్నారు. ఇక్కడ రూ.లక్ష, 50వేల బ్యాంకు ఎక్కువగా ఆడుతున్నారు. స్టేక్(బ్యాంకు) ఏదైనా ఒక్కో బ్యాంకుకు 250 పాయింట్లు ఇస్తారు. పేకాట నిర్వాహకుడు డబ్బులు ఇస్తే వారికి 250 పాయింట్ల లెక్కన కాయిన్లు ఇస్తారు. పేకాట శిబిరం వద్ద డబ్బుకట్టలు ఉండవు. శిబిరానికి వచ్చే ముందు నిర్వాహకుడు చెప్పిన ఒక కారు వద్దకు వెళ్లి డబ్బులు ఇస్తే ఆ మొత్తానికి సరిపడా కాయిన్లు ఇస్తారు. అయితే స్టేక్‌ను బట్టి పాయింట్ల విలువ మారుతుంది. రూ.50వేల బ్యాంకు అయితే ఒక్కో పాయింట్ విలువ రూ.200, రూ.లక్షకు రూ.400, రూ. 2లక్షలకు రూ.800గా ఉంటుంది. ఊరు, శిబిరం ఎక్కడైనా పాయింట్ల రేటు మాత్రం ఇలాగే ఉంటోంది.

- ఒక్కో గేమ్ 10మంది ఆడతారు. కొన్ని సందర్భాల్లో 7గురు ఉంటారు. ఒక గేమ్ పూర్తయితే గెలిచిన వ్యక్తి ఖర్చుల కింద నిర్వాహకుడికి కొన్ని పాయింట్లు ఇవ్వాలి.
- రూ.50వేలు బ్యాంకు ఆడేవారు 8 పాయింట్లు, రూ.లక్ష బ్యాంకు ఆడితే 6, రూ.2లక్షలు ఆడితే 5 పాయింట్లు ఇవ్వాలి. ఈ లెక్కన రూ.50వేల బ్యాంకు ఒక ఆటకు నిర్వాహకుడికి రూ.1,600, రూ.లక్ష బ్యాంకు ఆటకు రూ.2,400, హైస్టేక్ అయిన రూ.2లక్షల బ్యాంకు ఆటకు రూ.4,800 చొప్పున వస్తుంది. ఒక శిబిరంలో రోజూ కనీసం వంద ఆటలు జరుగుతాయి. ఈ లెక్కన రూ.50వేలు బ్యాంకు రోజుకు రూ.1.60లక్షలు, రూ.లక్ష బ్యాంకు ఆడితే రూ.14.40లక్షలు(వంద ఆటలు ఆడితే), రూ.2లక్షల బ్యాంక్ ఆడిస్తే రోజుకు రూ.24లక్షలు(వంద ఆడితే) నిర్వాహకుడికి ఆదాయం వస్తుంది. సగటున ఒక్కో శిబిరంలో రోజూ రూ.10–15లక్షల ఆదాయం నిర్వాహకులకే ఉంటోంది.

న్యూస్‌రీల్

డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ

- ట్రిబుల్ ఐటీడీఎం విద్యార్థుల డెమోను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



డ్రోన్ ఆధారిత ఆరోగ్య వ్యవస్థపై కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వివరిస్తున్న ప్రొఫెసర్లు

కర్నూలు(సెంట్రల్): డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థ రూపకల్పనకు కర్నూలు ట్రిబుల్ ఐటీడీఎం విద్యాసంస్థ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. కలెక్టరేట్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ట్రిబుల్ ఐటీడీఎం ఆధ్వర్యంలో రూపొందుతున్న డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థకు సంబంధించిన ప్రదర్శనను శుక్రవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని తక్షణమే వైద్య సదుపాయాలు అందించేందుకు ఈ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఘటన స్థలంలోనూ, ఆసుపత్రికి వెళ్తున్న సమయంలోనూ రోగుల పరిస్థితిని వైద్యులు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయవచ్చని తెలిపారు. ఈ వ్యవస్థ వైద్యులు, ఆసుపత్రుల మధ్య రియల్ టైం కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ఏర్పరుస్తుందన్నారు. అత్యవసర హెచ్చరిక, గ్రీన్ చానల్ సమయంలో అంబులెన్సుకు రూట్ క్లియర్ చేసేందుకు కూడా ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. ఈ వ్యవస్థను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. డ్రోన్ ఆధారిత ఆరోగ్య వ్యవస్థను రూపొందిస్తున్న ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ కె.కృష్ణానాయక్, విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్టుబడి యాప్‌ల పేరిట సైబర్ మోసాలు



విక్రాంత్ పాటిల్, ఎస్పీ

కర్నూలు: మార్కెట్ మాస్టర్, హ్యూజ్, షేర్ బూస్టర్, క్విక్ ప్రాఫిట్, స్టాక్ విజార్డ్ వంటి పెట్టుబడి యాప్‌లతో సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్న ఘటనలు జిల్లాలో ఇటీవల వెలుగులోకి వచ్చాయని, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు. ఈ యాప్‌ల ద్వారా లక్షల రూపాయలు వసూలు చేసి అనంతరం మూసి వేస్తున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కర్నూలు నగరానికి చెందిన ఒక మహిళ షేర్ బూస్టర్ యాప్ ద్వారా రూ.1.20 లక్షలు పెట్టుబడి పెట్టి టెలిగ్రామ్ గ్రూప్ ద్వారా ఒక బ్రోకర్ సూచనలతో డిపాజిట్ చేసిన తర్వాత యాప్ ఎర్రర్ చూపడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించిందన్నారు. అలాగే కర్నూలుకు చెందిన మరో మహిళ హ్యూజ్ అనే యాప్ ద్వారా రూ.90 వేలు పెట్టుబడి పెట్టిందని, స్పెషల్ ప్లాన్ ద్వారా నెల రోజుల్లో డబుల్ అవుతుందని ఆశ చూపించి అనంతరం యాప్ మూసివేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. టెలిగ్రామ్, వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే పెట్టుబడి సూచనలు పూర్తిగా నమ్మవద్దని, అనధికారిక లింకులు లేదా యాప్‌లలో డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయవద్దని ఎస్పీ సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే సైబర్ క్రైం 1930 హెల్ప్‌లైన్ నెంబర్ లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

'ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ, ఈసీ'

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ఎన్నికల కమిషన్, బీజేపీ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయని సీపీఎం నాయకులు ఆరోపించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ విధానాలను తప్పు బడుతూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. బిహార్ ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ బాగోతం బయట పడిందన్నారు. ఒక్కసారిగా స్పెషల్ ఇంటెన్సివ్ రిజన్ (ఎస్‌ఐఆర్) పేరుతో 65 లక్షల ఓట్లను తొలగించడమంటే బీజేపీకి అనుకూలంగా పనిచేయడమేనన్నారు. నాయకులు ఎం.రాజశేఖర్, టి.రాముడు, ఎండీ ఆనంద్‌బాబు, జి.రామకృష్ణ, ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఉరుకుంద ఈఓ విజయరాజుపై బదిలీ వేటు

- నూతన ఈఓగా కె.వాణి



కె.వాణి

మంత్రాలయం: ఉరుకుంద ఈరన్న క్షేత్రం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మేడిపల్లి విజయరాజుపై బదిలీ వేటుపడింది. గుంతకల్లులోని కసాపురం నెట్టికంటి అంజనేయస్వామి ఆలయ ఈఓగా ఆయనను బదిలీ చేశారు. అక్కడ ఈఓగా పని చేస్తున్న కె.వాణి ఉరుకుంద ఈరన్న ఆలయ ఈఓగా నియమితులయ్యారు. విజయరాజు గత ఏడాది సెప్టెంబర్ 24న ఇక్కడ ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పూజన్న ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే. తన సూసైడ్ నోట్‌లో ప్రధాన అర్చకుడు, వేదపండిట్ మాటలు విని ఈఓ తనతో పాటు ఇతర అర్చకుల పట్ల చులకన భావంతో వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో ఈఓ బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలాఉంటే కాంట్రాక్టర్ల అక్రమార్జనకు అడ్డుపడుతున్నాడనే కారణంతో రాజకీయ నాయకుల ప్రమేయంతో ఆయనపై బదిలీ వేటు వేసినట్లుగా చర్చ జరుగుతోంది. గతంలో ఈఓగా పని చేసిన హెచ్.జి.వెంకటేష్ కూడా అర్చకుల తట్టను తీయించి ఆలయ ఆదాయాన్ని పెంచడానికి శాఖాపరమైన నిర్ణయం తీసుకోవడం ఆయన బదిలీకి కారణమైంది. అప్పట్లో ఆయనను కూడా ఉత్సవాల వేళనే బదిలీ చేయడం గమనార్హం. తాజాగా విజయరాజు కూడా అదే తరహాలోనే బదిలీ అయినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్

కర్నూలు: రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యల్లో భాగంగా నెలాఖరు వరకు జిల్లా అంతటా స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ఆగస్టు 10న మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై డ్రంకెన్ డ్రైవ్, 11 నుంచి 17వ తేదీ వరకు అతివేగంగా వెళ్లే వారిపై హై స్పీడ్ స్పెషల్ డ్రైవ్, 18 నుంచి 24వ తేదీ వరకు హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారిపై హెల్మెట్ స్పెషల్ డ్రైవ్, ఆగస్టు 25 నుంచి 31వ తేదీ వరకు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఎస్పీ వివరించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 7వ తేదీ వరకు మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై 5,397 డ్రంకెన్ డ్రైవ్ కేసులు, అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై 11,362 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా



విద్యార్థులతో కలసి జాతీయ జెండాను చేతపట్టుకుని చూపుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, అధికారులు

- సెల్ఫీలను హర్ ఘర్ తిరంగా సైట్‌లో అప్‌లోడ్ చేయండి

కర్నూలు(సెంట్రల్): స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ప్రతి ఇంటిపై మువ్వన్నెల జాతీయ పతకాన్ని ఎగురవేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట కలెక్టర్ పి.రంజిత్‌బాషా దంపతులు, జిల్లా అధికారులు మువ్వన్నెల జాతీయ జెండాలు చేతబట్టి, క్యాండిల్ లైట్‌లతో తిరంగా కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా సెల్ఫీ పాయింట్‌లు/బూత్‌లు ఏర్పాటు చేసి సెల్ఫీలను www.harfharthiranfa.comలో అప్‌లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు ఆగస్టు 15వ తేదీన దేశ భక్తి ఉట్టిపడేలా భక్తిగీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. తిరంగా బైక్/సైకిల్ ర్యాలీలను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో తిరంగా ప్రదర్శనలు, రంగోలి పోటీలు, రాఖీ తయారీ, వర్కుషాపులను నిర్వహించేలా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఈఓ శామ్యూల్‌పాల్ పాల్గొన్నారు.

పూజ్యాయ.. రాఘవేంద్రాయ

- వైభవంగా ప్రారంభమైన రాఘవేంద్రుల సప్తరాత్రోత్సవాలు
- ధ్వజారోహణతో ఉత్సవాలు ప్రారంభించిన శ్రీమఠం పీఠాధిపతి శ్రీసుబుధేంద్రతీర్థులు



ధ్వజారోహణ చేస్తున్న శ్రీమఠం పీఠాధిపతి



ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయల ప్రభోత్సవం



పుష్కరిణి ప్రారంభోత్సవ పూజలో పీఠాధిపతి శ్రీసుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: వేదభూమి వేదఘోషతో మార్మోగుతుండగా.. మంగళవాయిద్యాల సుస్వరాలు ఆలపిస్తుండగా.. భక్తజనం నీరాజనాలు పలుకుతుండగా దైవాంశ సంభూతుడు రాఘవేంద్రస్వామి మఠం శిఖరాన ధ్వజం ఎగిరింది. అమరగుడి ఉత్సవాలకు అంకురార్పణ శంఖం పూరించింది. దైవాంశ సంభూతుడు శ్రీరాఘవేంద్రుల 354వ సప్తరాత్రోత్సవాలు శుక్రవారం వైభవోపేతంగా మొదలయ్యాయి. శ్రీమఠం పీఠాధిపతి శ్రీసుబుధేంద్రతీర్థులు అమృత హస్తాలతో శ్రీమఠం శిఖరాగ్రన స్వర్ణ బృందావన ధ్వజారోహణ చేశారు. ఉత్సవాలు ప్రారంభం కావడంతో రాఘవేంద్రస్వామి మూల బృందావనం నుంచి పీఠాధిపతులు ఊరేగింపుగా ఆలయ ముఖద్వారం ముంగిటకు చేరుకున్నారు. గోపూజ, అశ్వపూజ నిర్వహించి ధ్వజారోహణ గావించారు. ధ్వజారోహణ వేళ భక్తజనం 'నమో.. రాఘవేంద్రా' అంటూ స్వరించారు. అనంతరం కార్యనిర్వాహణ కార్యాలయం చేరుకుని లక్ష్మీ పూజ, ఏఏఓ, మేనేజర్, జోనల్‌మేనేజర్ తదితర కౌంటర్లలో పూజలుచేశారు. యోగీంద్ర మంటపంలో రాఘవేంద్రుల మైనపు విగ్రహానికి పుష్పార్చన, మంగళ హారతులు పట్టి జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రాంగణ వీధుల్లో అశేషభక్తజనం మధ్య ప్రభోత్సవం అంగరంగవైభవంగా జరిగింది.

పరిమళ తీర్థం పుష్కరిణి ప్రారంభం

శ్రీమఠం చరిత్రలో తొలిసారిగా రాఘవేంద్రస్వామికి తెప్పోత్సవం జరగనుంది. ఉత్సవ నిర్వహణ నేపథ్యంలో బెంగళూరుకు చెందిన ఎంఆర్‌జీ గ్రూపు సీఈవోలు ఆశా ప్రకాష్, శ్రీప్రకాశ్ శెట్టి సహకారంతో రూ.3.8 కోట్ల వ్యయంతో పరిమళ తీర్థం పుష్కరిణి నిర్మించారు.. శ్రీమఠం ఈశాన్య భాగంలో ఏర్పాటు చేసిన పుష్కరిణిని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. అలాగే భక్తుల సహకారంతో మూల బృందావన మంటప స్తంభాలకు బంగారు కవచధారణను ఆవిష్కరించారు. రూ. రూ.40 లక్షలతో నిర్మించిన కవీంద్ర నిలయ డార్మిటరీ, రూ.65లక్షలతో నిర్మించిన వాగీశ డార్మిటరీ, బెంగళూరు వాసులు ఏర్పాటు చేసిన డిజిటల్ లాకర్ సముదాయాలను ప్రారంభించారు. ఉత్సవాల్లో మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్–1 శ్రీనివాసరావు, మేనేజర్–2 వెంకటేషజోషి, జోనల్‌మేనేజర్ శ్రీపతిఆచార్, ధార్మిక సహాయకాధికారి వ్యాసరాజాచార్, ద్వారపాలక అనంత స్వామి, సంస్కృత పాఠశాల ప్రధానాచార్యులు వాదీరాజాచార్ పాల్గొన్నారు.

దంచికొడుతున్న వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): రుతుపవనాల ప్రభావంతో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు జిల్లాలోని హొళగుంద, చిప్పగిరి, తుగ్గలి మండలాలు మినహా మిగిలిన అన్ని మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా క్రిష్ణగిరిలో 66.8 మి.మీ, అత్యల్పంగా పత్తికొండలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం మీద సగటున 19.7 మి.మీ వర్షం కురిసింది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ ఉండగా.. మొదటి ఎనిమిది రోజుల్లో 63.7 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ నెల 11వ తేదీ వరకు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కాగా ఈ నెల 13న బంగాళఖాతంలో అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

మండలం	వర్షపాతం (మి.మీ)
క్రిష్ణగిరి	66.8
ఆదోని	59.4
కౌతాళం	38.4
కర్నూలు రూరల్	38.4
కర్నూలు అర్బన్	37.8
గూడూరు	35
కల్లూరు	35
మద్దికెర	27.2
ఓర్వకల్లు	22.4
సి.బెళగల్	20.2
ఆస్పరి	20.2

క్లుప్తంగా

పంటల భవితవ్యం తెలిపే దండలు

● నేడు పూల దండల ఉత్సవం


పూజలందుకున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారు

దేవనకొండ: నల్లచెలిమల గ్రామానికి రెండు కి.మీ. దూరంలో కొండమీద వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఏటా శ్రావణమాసం మూడో శనివారం దండల ఉత్సవం నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి నల్లచెలిమల గ్రామం నుంచి గన్నేరు పూలతో చేసిన మూడు దండలను గుర్రం మీద మేళతాళాల నడుమ స్వామివారి ఆలయానికి గ్రామస్తులు తీసుకొస్తారు. కొండ మీద వెలిసిన శ్రీ లక్ష్మి నరసింహస్వామికి దగ్గరగా ఉన్న పెద్ద రాళ్ల మధ్య నుంచి పూల దండలను కిందకు వదులుతారు. ఆ దండలు నలిగిన శాతాన్ని బట్టి రైతులకు పండే పంటలను చెబుతారు. మొదటి దండ ఎర్రనేలకు సంబంధించి, రెండో దండ కాలానికి సంబంధించి, మూడో దండం నల్ల రేగడికి సంబంధించిగా ఉంటాయి. దండలు ఏమీ నలగకుండా ఉంటే ఆ సంవత్సరం పంటలు బాగా పండుతాయి. కొద్దిగా నలిగితే సాధారణ పంటలుగా, ఎక్కువగా నలిగితే ఆ సంవత్సరం కరువు వస్తుందని భక్తుల నమ్మకం. ఈ ఉత్సవాన్ని చూడడానికి ప్రజలు అధిక సంఖ్యలో సంఖ్యలో తరలిరానున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

● కుడి భుజంపై ఆంజనేయ స్వామి టాటూ..



ఆదోని సెంట్రల్: ఇస్వి –కుప్పగల్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు..మృతుడిది 40 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉంటుంది. తీవ్రమైన రక్త గాయాలై మృతి చెందడంతో రైలు నుంచి జారి పడి ఉంటాడని అనుమానం వ్యక్తమవుతోంది. మృతుడి వద్ద కేవలం చెన్నై నుంచి ముంబాయికి వెళ్తున్నట్లు ట్రైన్ టికెట్ మాత్రం లభించింది. అతని కుడి భుజంపై ఆంజనేయస్వామి టాటూ ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

గొర్రెలు మేపేందుకు వెళ్లి..

● పాము కాటుతో రైతు మృతి


మృతి చెందిన బోయ సుంకన్న(ఫైల్)

కృష్ణగిరి: రామకృష్ణాపురం గ్రామానికి చెందిన బోయ సుంకన్న(45) పాముకాటుతో మృతి చెందాడు. ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాల మేరకు.. రైతు బోయ సుంకన్న పొలం చూసుకుంటూ తనకున్న గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈ నెల 6వ తేదీన పొలానికి వెళ్లి అక్కడి నుంచి గ్రామ సమీపంలోని గొర్రెలను మాలకొండ వైపు తీసుకెళ్లాడు. అక్కడ కొండలో పాముకాటుకు గురయ్యాడు. విషయాన్ని మరో కాపరి అయిన రామాంజినేయులు కుటుంబసభ్యులకు తెలియజేశారు. వెంటనే వారు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. భార్య శివమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మృతునికి భార్య శివమ్మతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.


అహోబిలంలో అమృతవల్లీ అమ్మవారికి తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం


మహానందిలో వరలక్ష్మీ వ్రతానికి హాజరైన భక్తజనం


మంత్రాలయంలో కరెన్సీ నోట్ల అలంకరణలో గ్రామ దేవత మంచాలమ్మ


మద్దిలేటయ్య క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వత్రంలో పాల్గొన్న భక్తులు

ఆశీర్వదించమ్మా..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో శ్రావణ శుక్రవారం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. అమ్మవారిని కలశంలోకి ఆవాహన చేసి వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించి పూజలు చేశారు. జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో మంగళ తోరణాలు కట్టి శ్రావణ లక్ష్మీని సాదరంగా ఆహ్వానించారు. మహిళలు వాయినాలు ఇచ్చి పుచ్చుకోవడంతో పాటు అమ్మవారికి ఒడి బియ్యం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. బనగానపల్లె మండలం నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో సామూహిక వ్రతం చేయించారు. అమ్మవారికి అభిషేకం, అర్చన చేశారు. కొత్తపల్లి మండలంలోని కొలనుభారతి దేవి ఆలయంలో చిన్నారులకు పురోహితుల చేత బీజాక్షరాలు దిద్దించి, తేనె తినిపించి అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మి మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, తులసీమాలార్చన చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత మద్దిలేటి నరసింహస్వామిని ఊరేగించారు. దిగువ అహోబిలంలో శ్రీ అమృతవల్లీ అమ్మవారిని వరలక్ష్మి అమ్మవారిగా అలంకరించారు. రాత్రి అమ్మవారికి మాడ వీధుల్లో వైభవోపేతంగా గ్రామోత్సవం నిర్వహించారు. –సాక్షి నెట్‌వర్క్


ప్రత్యేక అలంకరణలో కొలనుభారతి అమ్మవారు


కోవెలకుంట్ల మండలం రేవనూరులో గోపూజ నిర్వహిస్తున్న మహిళలు


శిరివెళ్ల మండలం కోటపాడులో సామూహిక వ్రతం ఆచరిస్తున్న మహిళలు


ఉరుకుందలో గాజుల అలంకరణలో..


నంద్యాలలో సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు


శ్రీశైలంలో వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న భక్తురాలు




నందవరంలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు, శ్రీ చౌడేశ్వరిదేవి విగ్రహానికి అభిషేకం చేస్తున్న పండితులు

రెండు బైక్‌లు ఢీకొని


క్షతగాత్రులను 108లో తరలిస్తున్న దృశ్యం

కోసిగి: సజ్జలగుడ్డం గ్రామ రోడ్డులోని కాశీనాయనా ఆశ్రమం వద్ద శుక్రవారం రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఐరన్‌గల్లు గ్రామానికి చెందిన కొలిమి మల్లికార్జున, లక్ష్మి బైక్‌పై కోసిగికు వస్తుండగా అదే రోడ్డులో భూంపల్లి గ్రామానికి చెందిన కొత్తూరు పవిత్ర, కుమారుడు కలిసి ఐరన్‌గల్లుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తూ రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మల్లికార్జున, లక్ష్మికి తీవ్ర గాయాలు కావడంతో 108లో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వ్యభిచార ముఠా గుట్టు రట్టు!

● 9 మంది నిర్వాహకులు, నలుగురు విటులు అరెస్టు


వ్యభిచార గృహ నిర్వాహకులతో పాటు విటులను అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: హైటెక్ పద్ధతిలో వ్యభిచారం నడుపుతున్న ముఠా గుట్టురట్టయ్యింది. ఆన్‌లైన్‌లో యువకులకు యువతుల ఫొటోలు పంపి వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను గురువారం రాత్రి పోలీసులు అరెస్టు చేసి విచారించగా అసలు విషయం బయటపడింది. కర్నూలు శివారు గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని ఓ ఇంట్లో కొన్ని నెలలుగా గుట్టుగా వ్యభిచారం సాగుతున్నట్లు సమాచారం అందడంతో నాల్గవ పట్టణ సీఐ విక్రమ సింహా, ఎస్ఐలు చంద్రశేఖర్ రెడ్డి, మోహన్ కిషోర్ రెడ్డిలు స్థావరంపై దాడి చేసి నిర్వాహకులతో పాటు విటులను అరెస్టు చేసి కటకటాలకు పంపారు. అరెస్టయిన వారిలో 9 మంది నిర్వాహకులు, నలుగురు విటులు ఉన్నారు. విజయవాడ, అనంతపురం, హైదరాబాదు, నంద్యాల ప్రాంతాల నుంచి యువతులు, మహిళలను తీసుకువచ్చి వ్యభిచార రొంపిలోకి దింపి వ్యాపారం సాగించేవారు. అమ్మాయిల ఫొటోలను వాట్సాప్‌లో పంపి విటులను ఆకర్షిస్తూ కొంతకాలంగా వ్యాపారం సాగిస్తూ వారిపై వచ్చే ఆదాయాన్ని నిర్వాహకులు వనరుగా మార్చుకున్నారని విచారణలో బయటపడింది. కల్లూరుకు చెందిన ఆళ్ల మధుసూదన్, నందికొట్కూరులోని మద్దూరు సుబ్బారెడ్డి నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ రజాక్, కర్నూలు షరీన్ నగర్‌కు చెందిన ఆరెపోగు శేఖర్, బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురానికి చెందిన అరిగెల శ్రీనివాసులు, కర్నూలు బాలాజీ నగర్‌కు చెందిన సుజాత, కర్నూలు సంతోష్ నగర్‌కు చెందిన గూగు ఫ్రోజ్ సైలు, నంద్యాల జిల్లా బనగానపల్లె ఈద్గా నగర్‌కు చెందిన షేక్ మాబున్ని, విజయవాడ హనుమాన్ నగర్‌కు చెందిన పులిపాక లక్ష్మి, కర్నూలు బాలాజీ నగర్‌కు చెందిన పోలిరెడ్డి భార్య అన్యం నారాయణమ్మ కలసి వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. నిర్వాహకులతో పాటు విటులు కురువ రవిబాబు, బింగి బాల అంకన్న, జయకృష్ణ, మిఠాయి పరుశురాం లాల్ తదితరులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. నిర్మానుష్య ప్రాంతాల్లో ఇల్లు అద్దెకు తీసుకుని ఇలాంటి వ్యభిచార గృహాలు నిర్వహిస్తారని, ఇంటి యజమానులు వివరాలు పూర్తిగా తెలుసుకున్న తర్వాతనే ఇల్లు అద్దెకు ఇవ్వాలని సూచించారు. ఎక్కడైనా వ్యభిచార కార్యకలాపాలు సాగుతుంటే డయల్ 112 లేదా 91211 01062 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

విజ్ఞాన దర్శిని.. పుస్తకం...

● పుస్తకాన్ని ప్రేమిద్దాం... విజ్ఞానాన్ని దోచేద్దాం...
● మానవుని పురోగమనంలో పుస్తకాలది మహత్తర పాత్ర
● పుస్తక పఠనంతోనే సంపూర్ణ పరిజ్ఞానం
● ఆధునిక సాంకేతికతతో తగ్గుతున్న పుస్తక పఠనం
● పుస్తక పఠనాన్ని ఖచ్చితం చేయాలంటున్న మేధావులు
● నేడు పుస్తక ప్రేమికుల దినోత్సవం



కర్నూలు కల్చరల్: పుస్తక పఠనంతో సంపూర్ణ పరిజ్ఞానం సిద్ధిస్తుంది. పుస్తకాల అధ్యయనం ఒక తపన. తీరని విజ్ఞాన దాహం. పుస్తకాలకు పుస్తక ప్రియులకు ఉండే అనుబంధం బలీయమైంది. పుస్తకాన్ని తమ జీవితాన్ని ఆదర్శంగా ముందుకు నడిపించే నిజమైన స్నేహితుడిగా.. మార్గదర్శకుడిగా భావిస్తారు. కొత్త పుస్తకం వచ్చిందంటే ఇంట్లో గ్రంథాలయంలో ఉండాల్సిందే. ఆర్థిక స్తోమత లేక కొన్ని పుస్తకాలు కొనలేకపోయినా ఏ గ్రంథాలయంలోనో స్నేహితుల వద్దో సంపాదించి చదివేదాక వారికి నిద్ర పట్టదు. ఇలాంటి గొప్ప అనుబంధాన్ని పెంచుకున్న పుస్తక ప్రియుల కోసం ప్రత్యేకంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 9న 'పుస్తక ప్రేమికుల దినోత్సవం' నిర్వహిస్తున్నారు. అయితే నేటి ఆధునిక సాంకేతి పరిజ్ఞానం పరుగుల్లో పుస్తక పఠనం బాగా తగ్గిపోయిందని.. ఇది సమాజంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విద్యావేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుస్తక పఠనం పెంచేలా చర్యలు చేపట్టాల్సి ఉందని అభిప్రాయపడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి కర్నూలులో జిల్లా కేంద్ర గ్రంథాలయం ఒకటి, 58 గ్రంథాలయ శాఖలు, ఒకటి గ్రామీణ గ్రంథాలయం ఉంది. సుమారు 150 పుస్తక సంక్షిప్త కేంద్రాలు ఉన్నాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు ఇతర గ్రంథాలయాల్లో 6,50,400 పుస్తకాలు ఉన్నాయి. కేంద్ర గ్రంథాలయంలో 10 వేల మంది, మిగతా వాటిల్లో 70 వేల మంది శాశ్వత సభ్యులు ఉన్నారు. కేంద్ర గ్రంథాలయంలో ప్రతి రోజు సుమారు 450 మంది పఠనం చేస్తుంటారు.

విద్యార్థి దశలోనే అలవాటు చేయాలి



మేధావుల అనుభవాలకు అక్షర రూపం పుస్తకం. ఇవి పాఠకుల్లో జ్ఞానాన్ని, నైతిక విలువలను పెంపొందిస్తాయి. విజ్ఞానంతో పాటు వినోదాన్ని అందిస్తూ మంచి మిత్రునిలా తోడుండి సమాజాన్ని అర్థం చేసుకోవడానికి సహాయ పడతాయి. విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలుగా మారకుండా నిరంతరం సామాజిక మాధ్యమాల్లో మునిగిపోయి చుట్టూ ఉన్న మనుసులతో సంబంధాలు కోల్పోకుండా పుస్తకాలు కాపాడతాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యార్థి దశ నుంచే పుస్తకాలు చదివించడం గ్రంథాలయాలకు తీసుకొని వెళ్లడం అలవాటు చేయాలి.

– డాక్టర్ ఎం. హరికిషన్, ఉపాధ్యాయులు, బాలల కథా రచయిత

పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలి



గ్రంథాలయాల్లో అన్ని వయస్సుల వారికి అవసరమైన పుస్తకాలు లక్షల్లో అందుబాటులో ఉన్నాయి. పాఠ్యాంశాలకు సంబంధించినవే కాకుండా విజ్ఞానాభివృద్ధికి ఉపయోగపడే పుస్తకాలు చదివేలా విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.జిల్లా కేంద్ర గ్రంథాయలంలో ఏసీ స్టడీ ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చాం. పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించేందుకు తరచుగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇటీవల విడుదల చేసిన పోలీస్ ఉద్యోగ నియామకాల్లో గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకున్న 13 మంది ఉద్యోగాలు సాధించారు.

– కె. ప్రకాష్, కార్యదర్శి, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ

కోవెలకుంట్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మధులత

కర్నూలు(అగ్రికల్చర్): కోవెలకుంట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలక ఏర్పాటైంది. గౌరవ చైర్మన్‌గా బనగానపల్లి శాసనసభ్యుడు బీసీ జనార్దన్‌రెడ్డి, చైర్మన్‌గా జి.మధులత, వైస్ చైర్మన్‌గా నందిరెడ్డి విష్ణుశేఖర్‌రెడ్డి, 13 మంది సభ్యులుగా నియమితులయ్యారు. ఈ పాలకవర్గం పదవీ కాలం ఏడాది పాటు ఉంటుందని ప్రభుత్వం జీఓలో పేర్కొంది.

పచ్చదనంపై గొడ్డలి వేటు!


టౌన్ మోడల్ కాలేజీ భవనం కుడి వైపు నరికేసిన చెట్లు

కర్నూలు సిటీ: స్థానిక ప్రభుత్వ (టౌన్ మోడల్) జూనియర్ కాలేజీ ఆవరణలోని పచ్చని చెట్లను అధికారులు తొలగించారు. చెట్లు కాలేజీ భవనం పైభాగానికి పాకాయని, కింది కొమ్మలు ఎండిపోయి రాకపోకలకు అంతరాయం కలుగుతుందనే కారణాలతో పచ్చని నీడనిచ్చే చెట్లను నరికివేసేందుకు నిర్ణయించారు. ఓ టింబర్ డిపోకు పని అప్పగించగా రూ.1500 కూలీ, భోజనం ఖర్చులు ఇచ్చేలా అంగీకారం కుదిరింది. దీంతో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కాలేజీ ప్రధాన భవనం కుడి వైపు ఉన్న పెద్ద చెట్లు ఐదు, మధ్యస్థంగా ఉండే చెట్లు రెండు, లెక్చర్ హాల్ అండ్ ఆడిటోరియం భవనం ముందున్న రెండు చెట్లు, మరికొన్ని చెట్ల కొమ్మలను కోత మిషన్, గొడ్డళ్లతో నరికేశారు.

వాల్టా చట్టానికి తూట్లు

వాల్టా చట్టం ప్రకారం నది పరివాహక ప్రాంతాల్లో తవ్వకాలు, చెట్ల నరివేతకు పాల్పడడం నేరం అవుతుంది. అభివృద్ధి నిమిత్తం ప్రభుత్వ స్థలాల్లో పెంచిన చెట్లను తొలగించాలంటే ముందుగా తహసీల్దారు, ఫారెస్ట్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. టౌన్ మోడల్ కాలేజీ ఆవరణలోని చెట్లను కొట్టేసేందుకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని తెలుస్తోంది. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై ఒక్కో చెట్టుకు రూ.10 వేల వరకు జరిమానా విధించి కేసులు కూడా నమోదు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.


ఆడిటోరియం భవనం ముందు నరికిన చెట్లు

అభివృద్ధి కమిటీ తీర్మానంతోనే..

నేను టౌన్ మోడల్ కాలేజీకి రెండు నెలల క్రితం ప్రిన్సిపాల్‌గా వచ్చాను. కాలేజీని అభివృద్ధి చేసేందుకు డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో చేసిన తీర్మానాల మేరకు భవనం పైభాగానికి పాకిన కొమ్మలు, రెండు ఎండిన చెట్లు, వేర్లు భవనం పునాదుల్లోకి చొచ్చుకుపోయిన చెట్లు, అడ్డంగా ఉన్న చెట్లను తొలగించాం. కొమ్మలు కిందికు ఉండడంతో ఇటీవల ఓ విద్యార్థికి దెబ్బలు తగిలాయి. నరికేసిన చెట్ల స్థానంలో పూల మొక్కలు నాటించేందుకు చర్యలు తీసుకుంటాం.

– పద్మావతి, టౌన్ మోడల్ కాలేజీ ప్రిన్సిపాల్

తనిష్క్‌లో వజ్రాభరణాల ప్రదర్శన ప్రారంభం



వజ్రాభరణాల ప్రదర్శనను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక గాంధీనగర్‌లో ఉన్న తనిష్క్ షోరూంలో ప్రత్యేకంగా వజ్రాభరణాల ప్రదర్శన ప్రారంభించినట్లు షోరూం నిర్వాహకులు ముప్పా ధీరజ్, కృష్ణ వెల్లడించారు. షోరూంలో శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోని 450 స్టోర్ల నుంచి ఎంపిక చేసిన అద్భుతమైన డైమండ్ అభరణాలను అందుబాటులో ఉంచామన్నారు. ఈనెల 10వ తేదీ వరకు ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ముప్పా భరత్, షోరూం మేనేజర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఈటీపీఎస్‌లో డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలి

కర్నూలు(సెంట్రల్): అన్ని శాఖల అధికారులు తమ కార్యాలయాలకు చెందిన డాక్యుమెంట్లను ఈటీపీఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఈటీపీఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో డాక్యుమెంట్ అప్‌లోడ్ చేసే అంశంపై కలెక్టర్ తహసీల్దార్లు, ఎంపీడీఓలతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు తమ కార్యాలయాలకు సంబంధించిన చట్టాలు, నియమ నిబంధనలు, కోర్టు ఆర్డర్లు, మెమోలు, జీఓలు, సర్క్యులర్లు, ప్రొసీడింగ్స్ తదితర ముఖ్యమైన డాక్యుమెంట్లను స్కానింగ్ చేసి ఈటీపీఎస్ ఆన్‌లైన్‌లో పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. రియల్ టైం గవర్నెన్స్‌లో ఈ ప్రక్రియ నిర్వహించడం జరుగుతోందని, అన్ని శాఖల అధికారులు మూడో రోజుల్లోపు అప్‌లోడ్ చేయాలన్నారు. అంశంపై పర్యవేక్షణ చేయాలని డీఆర్వోను ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలు సందీప్‌కుమార్, భరత్‌నాయక్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.